# తెగింపు

బద్దెపూడి సుధారాణి

పదివేలు లెక్కపెట్టి, నోట్లు అన్నీ, కట్టలు కట్టి, చిన్న కాకి సంచిలో పెట్టి విశ్వనాథానికి అందించాడు రంగయ్య.

విశ్వనాథం ఆ సంచీని భద్రంగా పట్టుకొని ఇంటికి బయలుదేరాడు. రోడ్డు ఎక్కగానే, ఎర్రని ఎండ నెత్తి కాలుస్తున్నది. బాకీ వసూలు చేసుకోవటానికి, వచ్చిన వడ్డీ వ్యాపారి విషపు నవ్వులా వుంది ఆ ఎండ కూడా! అనుకున్నాడు విశ్వనాథం.

ముఖాన పట్టిన చిరుచెమటల్ని చేత్తో తుడుచుకుంటూ, ఆలోచిస్తూ మెల్లగా నడుస్తున్నాడు విశ్వనాథం.

ఓ బట్టల కొట్లో గమాస్తా తను. నెలకి రెండు వందలు తెచ్చుకుంటున్నాడు. ఆస్తిపాస్తులు ఏమి లేకపోయినా, సంతానం మాత్రం ఐదుగురు. తన భార్య తాయారు, తల్లితండ్రులకి ఒక్కతే. వాళ్లు తనకి తాయారునిచ్చి పెళ్ళి చేసి ఒక ఇల్లు మాత్రం కట్టించి ఇచ్చారు.

తనకి పిల్లలు పుట్టక పూర్వం తన జీవితం బాగానే వుంది

పిల్లలు పుట్టాక, కష్టాలు ప్రారంభమైనాయి

“భార్యను ఒకటి రెండుసార్లు అడిగాడు

“తాయారూ! మీ నాన్నని అడిగి ఓ అయిదు వందలు పట్టుకు రాలేవూ? నీకూ, పిల్లలకి బట్టలు కొనుక్కురావచ్చు! పాపం పిల్లలకీ, నీకూ, కట్టుకునేందుకు మంచి బట్టలు కూడా, సరిగ్గా లేవు.”

“చాల్లేండి మీ కబుర్లు. ఇల్లు ఇచ్చింది గాక డబ్బుకూడా యిస్తారా? మా నాన్న అసలే కోపిష్ఠి చెప్పు తీస్తాడు అనేసింది.

నిజమే మరి ఎవరి సంసారం గొడవలు వాళ్ళవి. అనుకొని సరిపెట్టుకున్నాడు విశ్వనాథం

విశ్వనాథం సంతానంలో మొదటి వాడు భాస్కరం. ఎట్లాగో కష్టపడి బి. ఏ. అయిందనిపించాడు

రెండవది రమణి, బి. ఏ. చదువుతూ మానేసింది. మూడవది సుభద్ర పి. యు. సీ తో చదువు ఆపేయ్యాల్సి వచ్చింది. మిగతా వాళ్ళు ఇంకా చిన్న క్లాసులోనే వున్నారు. పిల్లలకి సరైన పుస్తకాలు లేక, జీతాలు కట్టలేక నానా బాధలు పడేవాడు అప్పుచేసి పెద్ద పిల్లలిద్దర్నీ ఎట్లాగో బి. ఏ. వరకు చదివించాడు. తక్కిన పిల్లలకి, ఆ మాత్రం కూడా చెప్పించలేనేమో అనుకున్నాడు

ఒక రోజు భోజనాలు చేస్తుండగా హఠాత్తుగా భాస్కరం “నాన్నా, నాలుగైదు ఉద్యోగాలకి “అప్లికేషన్స్” పెట్టాను. త్వరలో ఏదో ఒక ఉద్యోగంలో చేరతాను” అన్నాడు.

భాస్కరం చెప్పిన మాటలకి, సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు... కొడుకు చేతికి అంది వచ్చాడు ఫరవాలేదు.

ఇంక ఈ కష్టాలని తేలిగ్గా భరించగలను అనుకున్నాడు

కొడుకు మాటలు వింటూ, సంతోషంతో, తనకి పొయ్యవలసిన మజ్జిగకూడా, కొడుకు కంచంలోనే పోసింది తాయారు

పెద్దకూతురు రమణి ఆపూట ప్రత్యేకంగా తను పడుకునే పరుపు తీసుకువెళ్ళి భాస్కరానికి వేసింది.

తనకి దుప్పటి మాత్రం మిగిలింది ఆరాత్రి మాత్రం తృప్తిగా నిద్రపోగలిగాడు.

పెద్దపిల్లలు ఇద్దరూ, పెళ్ళికి ఎదిగి కూర్చున్నారు. తనకి శరీర పటుత్వం తగ్గుతున్నది, వయస్సు పెరుగుతున్నది. తను, చనిపోతే ఆడ పిల్లలందరికీ పెళ్ళిళ్ళుచేసి పంపించగల సమర్థుడవుతాడు భాస్కరం అనుకున్నాడు.

ఒక శుభదినాన భాస్కరంకి ఉద్యోగం వచ్చింది

తనకి ఎంతో విశ్రాంతి లభించినట్లు, పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు సంతోషంతో పొంగిపోయాడు

"నాన్నా! నాకు ఉద్యోగం వచ్చింది!" అంటూ, సంతోషంతో కొడుకు తనకి చెబుతాడనీ, తను సంతోషంతో, భాస్కరాన్ని దీవించాలి అని ఏమేమో కలలు కంటూ, కూర్చున్నాడు.

కానీ, తండ్రి అనేవాడు ఒకడు వున్నాడనే గుర్తే లేకపోయింది భాస్కరానికి.

"ఒరే భాస్కరం! రమణి పెళ్ళి చేయాలనుకుంటున్నాను, ఈ ఏడాది దానికి అప్పుడే ఇరవై నాలుగు ఏళ్ళు దాటినాయి, ఇంకా దానికి పెళ్ళి చేయకుండా వుంచటం బాగుండదేమో. నేను పెద్దవాడ్ని అయిపోతున్నాను ఏమంటావు? అన్నాడు తను.

"రమణికి పెళ్ళా? నాకేం తెలుసు? నాదేముంది? మీ ఇష్టం" అన్నాడు.

ఆ మాటకి సంతోషించాడు తను. భాస్కరానికి తన మీద ఇంకా, కాస్తో కూస్తో, గౌరవం వుందిలే అనుకుంటూ.

"రమణి ఇంటికి పెద్ద పిల్ల దాని పెళ్ళి ఘనంగా చేయాలని వుంది" అన్నది తాయారు.

"మీ వాళ్ళని అడిగి ఓ పదివేలు పట్టుకురా. అలాగే చేస్తాను" అన్నాడు తను.

తాయారు మాట్లాడలేదు నవ్వుకున్నాడు తను.

పక్కింటి రంగనాథం మాష్టారు చెప్పగా, నాలుగైదు సంబంధాలు చూచి వచ్చాడు. ఆ సంబంధాలు ఇంట్లో ఎవరికీ నచ్చలేదు. పైగా వాళ్ళవి సామాన్యమైన కోరికలు కావు. స్వర్గానికి నిచ్చెనలు వేశారు

విసుగుచెందని విక్రమార్కుడిలా అతడు మరో రెండు సంబంధాలు తెచ్చాడు. ఇక తప్పదు. వయస్సు వచ్చిన ఆడపిల్లకి పెళ్ళి కాకపోతే ఎన్ని అపనిందలు, అవమానాలకి గురికావల్సి వస్తుందో అని భయం తనకి. ఇంట్లో అందరికి పెద్ద కూతురంటే అభిమానం. మరి మంచి సంబంధమే చేయాలన్నారు. వెతగ్గా, వెతగ్గా మంచి సంబంధమే దొరికింది. పెళ్ళివారు పిల్లని చూచారు. నచ్చింది అన్నారు

చదువు అందం, ఆస్తి, అంతస్థు అన్నీ వున్నాయి వరుడికి. అందరికి బాగా నచ్చాడు.

ఈ సంబంధం పోతే మళ్ళీ ఇలాంటి మంచి సంబంధం వస్తుందో, రాదో అని గాబరా పడ్డారు ఇంట్లో అంతా. పెళ్ళి చూపులు అయ్యాక ఉత్తరము రాస్తామంటూ వెళ్ళారు. వాళ్ళ ఉత్తరము కోసం, మీన, మేషాలు. లెక్క పెట్టుకుంటూ కూర్చున్నారు అంతా, వచ్చింది ఉత్తరము.

వరుడుకి పాతికా, ముప్పయి వేలు యిస్తామంటున్నారు మాకు పిల్ల నచ్చింది. మీది మంచి కుటుంబము అని తెలిసి మీ సంబంధమే చేసుకోవాలని వుంది.

కట్నం పదివేలన్నా లేనిది బాగుండదు, ఎవరికైనా చెప్పుకునేందుకైనా. అంటూ వ్రాశారు వాళ్ళు.

ఆ పదివేలు అన్నమాట చదవగానే నవనాడులు కృంగిపోయినాయి.

"అంత ఆస్తి, అంతస్థు వున్నవాళ్ళు పది వేలల్లో సర్దుకుంటా మనటం మన అదృష్టం. తల్లక్రిందులు తపస్సు చేసినా, ఇలాంటి సంబంధం మళ్ళీరాదు. ఎట్లాగైనా సరే ఖాయం చేసుకు రమ్మ"ని తాయారు పోరు ఎక్కువైంది

పదివేలు ఎక్కడ తేగలడు తను? పది

వేలంటె మాటలా? భాస్కరాన్ని సలహా అడిగితేనో? అనుకున్నాడు.

"ఇలాంటి విషయాలు నాకేం తెలుస్తాయి. మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి." అంటూ భాస్కరం విదిలించాడు.

భాస్కరం ఉద్యోగం చేస్తున్నా, ఇంట్లో పైసా యివ్వడు మరి ఆ డబ్బు అంతా ఏం చేస్తున్నాడో? అనుకున్నాడు.

తీర్చుకోవటం సంగతి ఎట్లా వున్నా మంచి, అప్పుకోసం చెప్పులు అరిగేలా తిరిగాడు ఫలితం శూన్యమే అయిపోయింది. హఠాత్తుగా, ఒకరోజు పెళ్ళికొడుకు వాళ్ళ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది మళ్ళీ.

"మీరు ఏ సంగతి తొందరగా, తేల్చి చెప్పెయ్యాలి అవతల మరో సంబంధం సిద్ధంగా వున్నది. వాళ్ళు ఎంత కట్నమైనా యిస్తారు" అంటూ వ్రాశారు

మళ్ళీ కూతుర్ని. కొడుకుని. భార్యని సలహా అడిగాడు.

వాళ్ళు జవాబు ఇవ్వకపోగా,

"పదివేలు ఇచ్చి పెళ్ళి చేయలేని వాడివి. ఏం మనిషివి నీవు?" అన్నట్లు చూచారు వాళ్ళు.

మిత్రుల్ని సలహా అడగ్గా,

"ఇల్లు అమ్మెయ్యి" అన్నారు.

"ముప్పయి వేలకి ఇల్లు అమ్మెయ్యి. పదివేలు కట్నం, మూడువేలు పెళ్ళి ఖర్చు పోనూ, మిగిలిన డబ్బుతో ఏదో ఒక చిన్న కొంపను కొనుక్కోవచ్చు. మిగతా పిల్లల సంగతి నిదానంగా చూచుకోవచ్చు" అని స్నేహితులు చెప్పారు.

ఆ మాట భాస్కరానికి చెప్పాడు తను

"అమ్మెయ్యటం సులభమే. మళ్ళీ కొనటమే కష్టం" అన్నాడు దూకుడుగా.

"ఈ సంబంధం తప్పిపోతే ఇంత మంచి సంబంధం మళ్ళీ దొరకదు" అన్నది భాయాను.

"నీవు ఏమంటావమ్మా?" అని అడిగాడు కూతుర్ని.

మీరేదో ఆలోచనలో పడి, ఇంత మంచి సంబంధం పోగొట్టేలా వున్నారు, అన్నట్లు చూచింది రమణి.

ఇందరి మధ్య, తను ఏ రకంగాను గెలవ లేడు? తన సలహాలు వాళ్ళకి నచ్చేలా లేవు చెప్పినా? అనుకున్నాడు.

మర్నాడే పెళ్ళికొడుకు వాళ్ళకి ఉత్తరము రాసాడు, తను పదివేలు ఇవ్వటానికి అంగీకరిస్తూ.


మూడో రోజే తాంబూలాలు పుచ్చుకున్నారు.

పెళ్ళి రెండు మూడు రోజుల్లో, మంచి ముహూర్తం చూచిచేస్తే బావుంటుంది, మళ్ళీ పిల్లవాడికి ఇప్పట్లో శెలవు దొరకటం కష్టం అని చెప్పారు పెళ్ళివారు.

అన్నింటికి, సరే ననక తప్పలేదు. విశ్వనాధానికి.

ఇల్లు నలుగు రైదుగురు కొనటానికి ముందుకు వచ్చినా! సరైన బేరం కుదర

## సంక్రాంతి ముగ్గు



కుమారి చీలా అనితాసాగర్. జనగామ.

లేదు. పెళ్ళికి రెండు రోజులు మాత్రమే వ్యవధి వుంది. చెయ్యవలసిన పనులు బోలెడు వున్నాయి. కొనవలసినవి కూడా, ఎన్నో వున్నాయి. అవతల వాళ్ళు గొప్ప వాళ్ళు మర్యాదాకీ, లోటు చేయకూడదు. తను లేనివాడని వాళ్ళకి జాలి వుండదు అను కున్నాడు.

ఆ రాత్రి తన స్నేహితుడు వచ్చి చెప్పిన విషయానికి పిడుగు పడ్డట్టు అదిరి పోయాడు.

ఇల్లు ఇరవై వేలకైతే తీసుకుంటారుట. అంతకు పైన పైసాకూడా యివ్వరట అన్నాడు.

కాళ్ళు, చేతులు, చల్లబడ్డట్టు అయినాయి విశ్వనాథానికి.

"రేపు రాత్రికే పెళ్ళివాళ్ళు దిగుతారు. ఎల్లుండి పెళ్ళి. చేతికి డబ్బు వస్తుంది కదా? అని ముందుగా అప్పుచేసి అన్నీ కొనేశాను. ఇంక బేరాలు సారాలు పెట్టుకుంటే కుదరదు. పదిమందిలో అభాసు అయే పనులు మాత్రం చెయ్యకండి, మీకు పుణ్యముంటుంది" అని తాయారు ఒకటే పోరు.

ఎటూ, పాలు పోలేదు, ఏమి చేయటానికీ తోచలేదు. ఊఁ....అనక తప్పలేదు.

"పెళ్ళి" వున్నంతలోనే ఘనంగా చేశా వనిపించాడు, విశ్వనాథం గట్టివాడే మంచి సంబంధమే చేశాడు అన్నారు అంతా.

కూతురు అత్తవారింటికి సంతోషంగా వెళ్ళింది.

మిగిలిన డబ్బు లెక్కచూచుకోగా, బాధగా నిట్టూర్చాడు ఇంక తక్కిన పిల్లలకి పెళ్ళిళ్ళు చేయటం ఈ జన్మలో కుదరదు అనుకున్నాడు. అయిన ఖర్చు, పడిన బాధలు తలచుకుని.

భాస్కరం మరో ఊరు ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. ఇల్లు అమ్మాననే కాబోలు అనుకున్నాడు బాధగా.

మరో నెలలో, మిగిలిన డబ్బుతో చిన్న పెంకుటిల్లు కొనేశాడు. తెలిసిన మిత్రులు బజారులో నిలేసి అడిగారు, ఒకరోజు—

"భాస్కరం పెద్దవాడు. అట్లా వదిలేశా వేం? వాడికి కూడా పెళ్ళి చెయ్యి. కట్నం వస్తే రెండో పిల్ల పెళ్ళి చెయ్య వచ్చు" అన్నారు.

ఆ మాటే భాస్కరానికి వ్రాశాడు.

భాస్కరం దగ్గరనుండి జవాబుగా ఒక కార్డు ముక్క వచ్చింది. "నా పెళ్ళి విషయంలో, ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దు. ఎవరి ఖర్మ ఎట్లా జరగాలని వుంటే అట్లా జరుగుతుంది" అని. ఆ ఉత్తరము చదువు కొని బాధపడలేదు తనుపడే బాధల్లో ఇది ఎంతలే అనుకున్నాడు.

భాస్కరం ఇంటికి రావటం మానేశాడు, డబ్బు విషయం, తనుగాని, తల్లిగాని అడుగుతారని కాబోలు అనుకున్నాడు

"మరి సుభద్ర మాటేమిటి?" అంటూ, ప్రతిరోజూ చెవి క్రింద పోరు పెట్టేది తాయారు

"ఏదో ఒక రాత్రి అందరం కట్ట కట్టుకొని ఏ గంగలోనో, దూకేద్దాము. ఏ బాధలు, సమస్యలు వుండవు," అని గట్టిగా అరుద్దామను కున్నాడు, కానీ అరవలేక పోయాడు.

తను అనబోయే మాటకి, తిరిగి ఎన్ని మాటలు వినాల్సి వస్తుందో అని భయపడ్డాడు.

నానాటికి కృశించిపోతున్న తన శరీరాన్ని చూచుకొని బాధగా నిట్టూర్చాడు. తన జీవితానికి ఇంక విశ్రాంతి లేదు కాబోలు అను కున్నాడు

ఇంట్లో తాయారు నోరు మూయించ గలిగాడు. చుట్టు ప్రక్కలవాళ్ళ నోరు మాత్రం మూయించలేక పోయాడు.

"సుభద్రకి ఇరవయి నాలుగేళ్ళు వచ్చాయి. పెళ్ళి చేయరేం?" అంటూ, అనేక రకాల వ్యాఖ్యానాలు విన్నాడు.

"రమణి సంసారం, మూడు పువ్వులు, ఆరు కాయలుగా వుందట. భర్త తనమాటకి ఎదురు చెప్పడట! లోటు లేని జీవితమట.

మా అంత అదృష్టవంతులు ఈ ప్రపంచంలో మరొకరు లేరు అంటూ రాసింది.

చిక్కిపోయిన శరీరాలతో, ఒంటి మీద మంచి బట్టలుకూడా లేకుండా వున్న ముగ్గురు కూతుళ్ళని చూడలేక బాధగా ముఖం తిప్పేసుకున్నాడు.

పోనీ లే ! అది అన్నా, చీకూ చింతా, లేకుండా వుంది అనుకొని సంతోషించాడు.

సుభద్రకి వరుడ్ని తేవాలి. పిల్ల బాగున్నా, కట్నం కావాలి. ఈ కట్నాల సమస్య తెగదు. అయినా మళ్ళీ భాస్కరాన్ని కదిలించి చూడాలనిపించింది. భాస్కరం వున్న ఊరు వెళ్ళాడు

అంతవరకు స్నేహితుల మధ్య కూర్చుని నవ్వుతూ, ఉషారుగా కబుర్లు చెబుతున్న భాస్కరం.

తండ్రిని చూడగానే ముఖం చిట్లించాడు. తను ఎన్ని విషయాలు చెబుతున్నా, ఉ.... ఆ....లతో, సరిపుచ్చాడు భాస్కరం.

"జీతంలో ఏమన్నా మిగుల్చుకుంటున్నావా ? బాబూ !" అని అడిగాడు ఎంతో అప్యాయంగా, తనలాగ కొడుకు కష్టపడకూడదు. ముందు ముందూ అనుకుంటూ,

"ఇదేం పల్లెటూరా ? ప్రతి క్షణం పైసాలతో బ్రతకాల్సిన పట్టణం" అన్నాడు చిరాగ్గా.

భాస్కరాన్ని మరో విషయం అడిగేందుకు ధైర్యం చాలక, తిరుగు బస్సులోనే ఇంటికి వచ్చేశాడు.

ఇంక మిగిలింది రమణి. భాస్కరం అంత కఠినాత్మురాలు కాదు. రమణి తప్పక మాట సహాయం, డబ్బు సహాయం కూడా, చేయగలదు అనుకున్నాడు.

మర్నాడే రమణి వున్న ఊరు వెళ్ళాడు.

అల్లుడుగారు బాగానే పలకరించి మర్యాదలు చేశాడు. వాళ్ళ ప్రేమాభిమానాలకి పొంగిపోయాడు. ఆ సాయంత్రమే సుభద్ర పెళ్ళి విషయం ఎత్తాడు, రమణి దగ్గర.

"అదేమిటి నాన్నా! దానికోసం అంత ఆలోచనెందుకు ? ఇల్లు అమ్మెయ్యవచ్చు. వచ్చిన దాంతో సుభద్ర పెళ్ళి చేయవచ్చు. తరువాత పిల్లకి ఇప్పుడే తొందరలేదు కదా ! వాళ్ళకి, ఆఫీసరూ. అందగాళ్ళూ రారు కదా ! చేసుకోవటానికి. మనం అలాంటి వాళ్ళ కోసం చూడటం కూడా హాస్యాస్పదం. కట్నాలు పొయ్యలేరు కదా మీరు ?"

సుభద్ర, చాలా అందంగా కూడా వుండదు. కొంచం నలుపు, చదువూ తక్కువ. వాళ్ళకి పెళ్ళిళ్ళు కావటం కష్టం కూడాను. ఆస్తి వున్న, రెండో పెళ్ళివాళ్ళు అయితే ఒప్పుకోవచ్చు" అన్నది రమణి

"పెద్ద శ్రమ లేకుండా, చవకలో అయిపోతుందికూడా ?" అన్నాడు అల్లుడు గారు కూతురితో వంత పాడుతూ

రమణి మాటలకి తలతిరిగి పోయింది. డబ్బు మనిషిని ఎంత తొందరగా మార్చేస్తుంది, ఎంత అహంకారాన్ని తెచ్చి పెడుతుంది ?" అనుకున్నాడు రమణిని చూస్తూ.

"ఆ ఇల్లు కాస్తా అమ్మేస్తే భాస్కరానికి ఎట్లాగమ్మా" అన్నాడు తను మెల్లగా.

"వాడికేం. సంపాదించుకోగలడు. కట్టుకో గలడు." అని తేలిగ్గా చెప్పేసింది రమణి.

"చూడండి ! మీరు పెద్ద సంబంధాలు తేవటం కష్టం. డబ్బు లేని పరిస్థితి మీది. వరుడికి చదువు, వున్నా లేకపోయినా, రెండో పెళ్ళివాడు అయినా వెయ్యి రూపాయలలో పెళ్లి ఖర్చు తేలిపోయేలా చూడండి. వాళ్ళకేమైనా తిండి బట్టా కావాలంటే మీ అమ్మాయి చూస్తుంది అప్పుడప్పుడు" అన్నాడు అల్లుడు.

తన అసమర్థతని ఆసరాగా తీసుకొని కదూ ! వాళ్లు అట్లా మాట్లాడగలిగింది అనుకున్నాడు బాధగా

"వెళ్ళి వస్తానమ్మా ! ఇంటికి వెళ్ళగానే

ఆలె ఒస్తాను. ఏ సంగతీను" అనిచెప్పగానే,

"మేము చెప్పినట్లు చెయ్యి నాన్నా! వాళ్ళ కోసం అప్పులు మాత్రం చేయకు" అన్నది రమణి ఆమె మాటలకి నవ్వుకున్నాడు.

రమణిలో అహం ఎంత పెరిగిపోయింది అనుకున్నాడు.

తను రైలుదిగి ఇంట్లోకి అడుగు పెట్టగానే, "అక్కయ్య బాగుందా? అక్కయ్య మమ్మల్ని రమ్మన్నదా? అని అడుగుతున్న సుభద్రా, మిగతా పిల్లల్ని జాలిగా చూచాడు.

తననే వుండమని చెప్పని రమణి, వీళ్ళని ఎక్కడ పిలుస్తుంది? ఎక్కడ తలుస్తుంది? అనుకున్నాడు మనస్సులో

ఆరాత్రి అన్నం తింటుండగా, తాయారు "ప్రక్క వీధిలో స్కూలు ఏదో పెట్టారుట. మన సుభద్ర అందులో, టీచరుగా చేరిందిట. నాకు ముందుగా చెప్పలేదు" అన్నది భయపడుతూ.

"నిజమేనా? సుభద్రా!" అని అడిగాడు తను.

"నిజమే నాన్నా! నేనేం తప్పుపని చేయలేదుగా. నిద్రలేచింది మొదలు, అందరం నిన్ను పీక్కుతినాల్సి వస్తున్నది. ఇంట్లో ఖర్చులకైనా నాలుగు డబ్బులు వస్తాయని చేరాను." అని నిర్భయంగా చెప్పింది సుభద్ర.

తన సంతానంలో ఇది ఒక రకం కాబోలు అనుకున్నాడు.

సుభద్ర ఉద్యోగం చేయటం మొదలు పెట్టాక, చీటికి మాటికి "అవితెండి, ఇవి తెండి" అనే తాయారు పోరు తప్పింది.

సుభద్ర తన మొదటి నెల జీతంతోనే, చెల్లెళ్ళకి, తల్లికి బట్టలు తెచ్చింది.

"నాన్నా! మీకు కొందామనుకున్నాను. మీరేమో ఏమైనా అంటారని భయం నాకు." అన్నది సుభద్ర.

"నా కెందుకమ్మా పెద్దవాడ్ని వున్నవేవో చాలు, చిన్నపిల్లలు మీకే ముఖ్యంగా కావల్సింది" అన్నాడు.

సుభద్ర పుణ్యమా? అని కొన్ని ఖర్చులు తగ్గినాయి ఇంట్లో తనకి. సుభద్ర ఉద్యోగంలో చేరింది అని రమణికి రాయగానే. రమణి వచ్చింది. రావడంతోనే ఇంట్లో తుఫాన్ లేపింది.

"నాన్నా! నీకేమైనా జ్ఞానంవుందా? దాన్ని ఉద్యోగంలో ఎందుకు చేర్పావు? మహారాణిలాగా, తిని తిరుగుదా మనుకుందేమో పెళ్ళి పెటాకులు లేకుండా, ఈ రకంగా తయారైతే దానికి ఈజన్మలో పెళ్ళికాదు చూడు" అన్నది రమణి సుభద్రని చురచురా, చూస్తూ.

"బి ఏ చదివినా, నా చదువుని ఏ విధముగానూ ఉపయోగించ లేకపోయాను. పి యూసి చదివినసుభద్ర, ఉద్యోగం చేయటం ఇంట్లో తండ్రికి అండగా నిలబడటం తనకి ఎంత అవమానం?" అని తెగ బాధపడిపోయింది రమణి.

అవును పెద్దవాడూ, పెద్దపిల్లా చేయలేని పని, చిన్నది చేయుటం ఎంతో గొప్ప అనుకుంటారు అందరూ, అనుకొని వున్న వారం రోజులూ నానా యాగిచేసి పెట్టింది రమణి సుభద్రచేత ఉద్యోగం మానిపిస్తాను. అనే వరకు వూరుకోలేదు?

తను ఒకటి రెండుసార్లు కట్టిపడేసిన చీరలు, రవికలు పాతబడినవి, చెల్లెళ్ళకి పడేసింది. రమణి, తను కొత్త చీర పెట్టించుకుని.

పిల్లలు నోరెత్తకుండా ఆ వారం రోజులు బిక్కు బిక్కుమని గడపటం చూసి జాలేసింది విశ్వనాధానికి

అల్లుడు వచ్చాడు కూతుర్ని తీసుకు వెళ్లేందుకు.

వెళుతూ, వెళుతూ పదే, పదే చెప్పాడు. ముఖ్యంగా రమణి, స్టేషన్లో తండ్రితో, "అది ఉద్యోగం అని చెప్పి చేరింది. అక్కడ ఎవడితోనో, స్నేహం చేసి, లేచిపోతుంది చూస్తుండు ఉద్యోగం చేసే ఆడ

పిల్లల్ని నమ్మకూడదు. అసలు ఉద్యోగం చేసే ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావు. అపనిందల పాలు కావటం తప్ప. ఉద్యోగం మాన్పించు" అని చెప్పింది గట్టిగా.

"రమణీ! వాళ్లు నీకు పరాయి వాళ్లు కూడా కాదు నీకు తోబుట్టువులు అమ్మా, వాళ్ళమీద నీకు అంత ద్వేషం పనికిరాదమ్మా! అని చెప్పాలనుకున్నాడు తను. కాని గొప్పింటి కోడలు. తన కూతురు. ఎదురు చెప్పలేక తల వంచాడు.

రమణి చేసిన గొడవ ఊరూ, వాడా, తెలిసిపోయింది.

ఇంట్లో వాళ్ళకే ఒకరిమీద, ఒకరికి గౌరవాభిమానాలు లేకపోతే, బయట వాళ్ళకి అలుసు ఏర్పడటం సులభం. సుభద్రని గురించి అనేక కథలు అల్లారు, కొందరు హేళనగా మాట్లాడారు

వాళ్ళతో గెలవలేక సుభద్రని ఉద్యోగం మాన్పించాడు

విశ్వనాథం మిత్రుడు ఒక సంబంధం తెచ్చాడు రెండేళ్ళక్రితం భార్య చనిపోయిందట. కట్నం మూడు నాలుగు వేలల్లో సద్దుకోవచ్చునట. అతనికి రెండెకరాల పొలం వుందట చదువు లేదు. పల్లెటూరు కాబట్టి తిండికి, బట్టకి లోటు వుండదు అతనికి వయస్సు నలభై దాటిందట

తను వెళ్ళి వరుణ్ణి చూశాడు బట్టతలతో, నల్లగా, లావుగా వికారంగా వున్నాడు నెరి

## "సంక్రాంతి శోభ"



వి. శాంతి శ్రీదేవి. (14 సం॥) వెల్లటూరు.

సిన తలతో

ఈ సంబంధం గురించి రమణి ఏమంటుందో అని రాయగానే, సంతోషంతో పొంగిపోతూ "దాని అదృష్టం బాగుంది. దానికి పెళ్ళి అయ్యే గీత వుంది. కాబోలు, ఈ మాత్రం సంబంధమైనా దొరికింది. మీరు ఆలోచించకుండా, వెంటనే ఈ మనువు ఒప్పుకొని చేసెయ్యాల్సిందే" అని రాసింది రమణి.

ఆ ఉత్తరము చూచినప్పటి నుండి. సుభద్ర దిగులుగా వుండటం రెండు మూడు సార్లు కళ్ళొత్తు కోవటం చూచి, బాధ పడ్డాడు తను. ఎందుకో తనకి ఈ సంబంధం సుభద్రకి చేయాలనిపించలేదు. అయినా సుభద్రని అడిగాడు ఏమంటుందోనని కాని మౌనం వహించింది.

"అందుకు మరీ బాధ పడ్డాడు. భాస్కరానికి బ్రతిమాలుతూ సలహా యివ్వమని కోరుతూ రాశాడు తను.

"రమణి చెప్పినట్లు చెయ్యండి నాకేం తెలియదు అని రాసేశాడు, తనకి ఎందుకో పట్టుదల పెరిగింది. సుభద్రకి మంచి సంభంధమే చేయాలని పించింది.

చూడగా, చూడగా, పెద్ద అల్లుడి కన్నా మించిన సంబంధమే దొరికింది. కట్నం కానుకలు ఇవ్వాలి. పెళ్ళి ఘనంగా చేయాలి అన్నారు వాళ్ళు.

మొత్తం ఖర్చులకి పదివేలు అన్నా కావాలి అయినా ఈ సంబంధమే సుభద్రకి చేయాలని పించింది విశ్వనాధానికి,

వడ్డీ వ్యాపారి రంగయ్యతో తన గోడు చెప్పుకోగా.

"పంతులూ ! ఇల్లు తాకట్టుపెట్టు పదివేలు ఇస్తాను. తరువాత సంగతి ఆలోచిద్దాం అన్నాడు."

సరేననక తప్పలేదు తనకి.... ...

ఆ రోజే ఇల్లు తాకట్టు రాసుకొని, పదివేలు తీసుకున్నాడు ఆలోచిస్తూ, ఇంటికి బయలుదేరాడు.

"పాపం సుభద్ర చిన్నప్పటినుంచి కష్టాలే పడుతుంది. పెళ్ళి చేస్తున్నాను కదా! ఇకనైనా సుఖపడితే నాకు అంతేచాలు" అనుకుంటూ ఇల్లు చేరాడు విశ్వనాథం.

గుమ్మంలో అడుగు పెట్టేసరికి అతని గుండెలు జల్లుమన్నాయి. ఇంటిల్లిపాదీ ఏడుస్తున్నారు. "ఏం జరిగింది? సుభద్ర ఏది?" అంటూ ఆదుర్దాగా అడిగాడు విశ్వనాధం. అతని భార్య తాయారు ఓ ఉత్తరం అందించిందతనికి _

"నాన్నా! మీరేమీ నాగురించి కంగారు పడకండి. ఇల్లు తాకట్టు పెట్టి నా పెళ్ళిచేస్తే సరిపోయిందా? మిగతా చెల్లెళ్ళు ఏమయిపోతారు? ఇదంతా బాగా ఆలోచించి నా స్నేహితురాలి ద్వారా ఉద్యోగం సంపాదించుకున్నాను. ఉన్న వూళ్ళో వుద్యోగం చేస్తే, అక్క పరువు పోతుందని గోలచేసి నన్ను మానిపించేసింది. అందుకని పొరుగూరిలో ఉద్యోగం చూసుకున్నాను. నా జీతంలో కొంత సొమ్ము ప్రతినెలా మీకు పంపుతాను. మిగతా పిల్లల్ని జాగ్రత్తగా చూడండి, అదే నాకు తృప్తి. నా పెళ్ళి ఇప్పుడే చేసుకోకపోతే కొంపేమీ మునిగిపోదు. అందుకు విచారించకండి. కట్నం ఆశించని వాడూ, నాకు నచ్చిన వాడూ, నన్ను మెచ్చినవాడూ తటస్థపడ్డాకే నేను పెళ్ళిచేసుకుంటాను ఇది తెగింపు అని భావిస్తే మీరు నన్ను క్షమించండి.

మీ కుమార్తె
సుభద్ర

ఈ పుత్తరం చదువుకుని ఎటూ చెప్పలేక కుర్చీలో కూలబడి పోయాడు విశ్వనాధం